సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 23 । జూన్ । 2023



సేంద్రియంపై ప్రచారమేదీ?

సేంద్రియ ఎరువులపై ప్రచారం కొరవడ టంతో వినియోగంపై రైతులు అంతగా దృష్టిసారించడం లేదు. 8లో▸



స్వీపర్లతో చికిత్స..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను ఆస్పత్రికి తీసుకువస్తే స్వీపర్లు, సిబ్బందితో చికిత్స అందించారు.. 8లో▸



ఆఫర్లతో ఆర్టీసీ

ప్రయాణికులను ఆకర్షించడానికి ఆర్టీసీ సరికొత్త ఆఫర్లను తీసుకువస్తోంది. సంస్థను గట్టెక్కించేందుకు ప్రయత్నిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఐటీఐ కళాశాల శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియర్ హెల్త్ కేర్ సర్వీసెస్, హోమ్ నర్సింగ్‌లో ఉద్యోగాల భర్తీ కోసం మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, పారా మెడికల్, 7వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత భోజన వసతులు కల్పిస్తారని తెలిపారు. వివరాలకు 9676047444 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నాటిన చోటే నాటి!

పెద్దేముల్‌లో అభాసుపాలవుతున్న హరితహారం



నాగులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో నాటిన మొక్కలు

పెద్దేముల్: హరిత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ అధికారులు ఏటా వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా వీటి సంరక్షణ మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. 2009 నుంచి ఏటా వర్షాకాలంలో బ్లాక్ ప్లాంటేషన్ , హరిత మహోత్సవం పేరుతో మండల పరిధిలోని నాగులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏటా వేలాది మొక్కలు నాటుతున్నారు. కానీ ఇవన్నీ లెక్కలకే పరిమితమవుతున్నాయి. కనీసం పది శాతం మొక్కలు కూడా బతకడం లేదని నాగులపల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్ల, ఆత్కూర్, ఇందూరు, పాషాపూర్ తదితర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ నెల 19న హరిత మహోత్సవం పేరుతో ప్రభుత్వం నాగులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేతుల మీదుగా హరితమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. ఈసారి కూడా ఇక్కడే సుమారు 11 వేల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సుమారు పదేళ్లుగా ఇక్కడ మొక్కలు నాటడం తప్ప.. కనీసం పదిశాతం కూడా బతకలేదు. అయినప్పటికీ హరితహారం నిర్వహణకు ఏటా ఈ ప్రాంతాన్నే ఎంచుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓసారి రోడ్డుకు ఇటువైపు.. మరో ఏడాది అటు వైపు మొక్కలు నాటడం తప్ప చెట్లుగా ఎదిగింది లేదు. కనీసం ఈ ఏడాది నాటే మొక్కలైనా బతికేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. నాగులపల్లి ఫారెస్ట్‌లో ఈఏడాది మొక్కలు నాటుతామని తాండూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్ రావు, సెక్షన్ అధికారి మమత తెలిపారు. మొక్కలన్నీ బతికేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2024 ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తండ్రి వార్షికాదాయం రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపిక విధానంలో రిజర్వేషన్ నియమం అమలవుతుందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ వచ్చేనెల 23న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 040- 23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

తపాలశాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జుబేర్



తపాల శాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ సెంటర్

షాద్‌నగర్‌రూరల్: తపాలశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తపాలశాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జుబేర్ అన్నారు. పట్టణంలోని తపాలశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ సేవలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునే వారు తపాలశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. ప్రతిరోజు 50 నుంచి 60 మంది ఆధార్ సేవలను వినయోగించుకొని అప్‌డేట్ చేసుకుంటున్నారని అన్నారు. తపాలశాఖ కార్యాలయంలో 1000 మందికి పైగా ఆధార్ సేవలను వినియోగించుకున్నారని వివరించారు.

అమరులారా వందనం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన మంత్రి సబితారెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యేలు, నాయకులు

సూర్యచంద్రులు ఉన్నంత వరకు మీ త్యాగాలు గుర్తుంటాయి

- తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయి
- తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో దేశంలోనే అగ్రగామిగా నిలిచాం
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- వికారాబాద్‌లో ఘనంగా అమరవీరుల దినోత్సవం

వికారాబాద్: ప్రత్యేక ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను తెలంగాణ ఎప్పటికీ మర్చిపోదని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి నూతనంగా నిర్మించిన అమరవీరుల స్థూపాన్ని ప్రారంభించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అమరుల కుటుంబాలను ఘనంగా సన్మానించి, ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సూర్యచంద్రులు ఉన్నంత వరకు అమరుల త్యాగాలు గుర్తుండిపోతాయన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో అనేక మంది ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. హోంమంత్రిగా ఉన్న సమయంలో తాను కూడా తెలంగాణ బిడ్డలకు అండగా నిలిచానన్నారు. ఎవరెన్ని అభ్యర్థనలు చేసినా.. తెలంగాణ వచ్చే వరకు ఎస్ఐ పరీక్షలు నిర్వహించేది లేదంటూ రద్దుచేశానని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఆంధ్రా పాలకుల ఆంక్షలు కొనసాగుతున్న వేళ తన వాహనంపై జై తెలంగాణ అని రాయించుకున్న ఏకైక వ్యక్తి ఇంద్రారెడ్డి అని స్పష్టం చేశారు. కొద్ది సమయంలో అమరవీరుల స్థూపాన్ని చక్కగా నిర్మించిన కలెక్టర్, అధికారులను అభినందించారు. 22 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల కలలు, ఆకాంక్షలు నెరవేరాయని, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. 14 రోజులు ఆమరణ దీక్షతో చావు అంచుల వరకు వెళ్లి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు.

బంగారు తెలంగాణ దిశగా..

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలిచిందని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. ఎంతో మంది త్యాగాల ఫలితమే తెలంగాణ అని తెలిపారు. కేసీర్ సారథ్యంలో రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా పరుగులు తీస్తోందన్నారు. పల్లెలు, పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కేంద్రం ప్రభుత్వం నుంచి ఏటా వస్తున్న అవార్డులే ఇందుకు నిదర్శనమని వెల్లడించారు.

అందరి సహకారంతోనే..

దశాబ్ది ఉత్సవాలను గడపగడపకు తీసుకెళ్లి, జయప్రదం చేసిన వారందరికీ కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్‌ను పాటి స్తూ అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎంతగానో సహకరించారన్నారు. అమరవీరుల స్థూపం నిర్మాణానికి సహకరించిన వారికి ధన్యవాదాలు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రదీపటేల్ మాట్లాడుతూ.. అడగగానే అమరవీరుల స్థూపం నిర్మించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వేడుక ల్లో భాగంగా కళాకారుల ఆటపాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎమెల్యేలు యాద య్య, మహేశ్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆయా శాఖల జిల్లా అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

దేశ హితమే బీజేపీ ఎజెండా

- తొమ్మిదేళ్లలో పారదర్శకమైన పాలన
- మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి
- వికారాబాద్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

వికారాబాద్ అర్బన్: ప్రజా సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం, దేశరక్షణ అనే ప్రధాన ఎజెండాలతోనే బీజేపీ, మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన కొనసాగిందని కేంద్ర బొగ్గు, గనుల, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. పట్టణంలోని జేకే కన్వెన్షన్‌లో గురువారం బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల మండల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల హితమే ప్రధాని లక్ష్యమన్నారు. మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర పథకాలకు గులాబీ రంగు పూసి ప్రచారం చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. మోదీ దేశంకోసం పనిచేస్తుంటే కేసీఆర్ తన కుటుంబ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని మండిపడ్డారు. మోదీ పథకాలను సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్తే బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. రాష్ట్రంలోని రహదారుల నిర్మాణానికి పూర్తి నిధులను కేంద్ర ప్రభుత్వమే అందజేస్తోందని వివరించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలపడటంతోనే అమెరికా వంటి అగ్ర దేశాల్లో మన దేశానికి తగిన గౌరవం లభిస్తోందన్నారు. వచ్చే ఐదేళ్లలో మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా నిలవనుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు టి.సదానంద్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, మాధవరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలను అంతమొందించాలి..

పరిగి: రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, దీన్ని అంతం చేసి బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్వాగత్ రెస్టారెంట్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 80శాతం మందికి కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో భారత దేశ కీర్తిప్రతిష్టలు ప్రపంచం నలుమూలలా వ్యాపించాయని తెలిపారు. వచ్చే డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని, ఇందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చే శారు. రాష్ట్రంలోనూ ఈసారి విజయం తమదేనని స్పష్టంచేశారు. పార్టీ కోసం పనిచేసే వారికే టికెట్లు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్‌డీ బృందం పర్యటన

కద్లాల్: రాజస్థాన్, మధ్యప్రదేశ్, గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) అధికారుల బృందం గురువారం మండల కేంద్రంలో పర్యటించింది. ఈ సందర్భంగా కద్లాల్, మైసిగండి గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జీవనోపాధికి ఏర్పాటు చేసిన వివిధ రకాల యూనిట్స్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి యూనిట్స్ ద్వారా వస్తున్న ఆదాయం, లాభ నష్టాలు, మెటీరియల్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల యూనిట్స్‌ను ఏర్పాటు చేసుకుని మహిళా సంఘాలు సాధిస్తున్న ప్రగతిని చూసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ జంగారెడ్డి, డీపీఎం నర్సింహా, ఏపీఎం రాజేశ్వరి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కై లేశ్ చంద్రశర్మ, కమలేశ్‌లోధా, అశిశ్‌నాయక్, అక్షిత పరాభ్, విద్యా, రక్షత, పాయల్‌కుమారి, జ్యోతీ లహరి అమ్రపాలి జవాల్కర్, సీసీలు లుజారీనా, నర్సింహ, మల్లేశ్, రాములు, వసంత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జంగమ్మ, నిర్మల, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

• వెల్లువెత్తిన అభిమానం



శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో 'మేధా రైల్ కోచ్ ఫ్యాక్టరీ' ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. అడుగడుగునా ముఖ్యమంత్రికి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు.

తెలంగాణ ఇచ్చింది.. తెచ్చింది కాంగ్రెస్సే



పరిగిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి



అనంతగిరి: వికారాబాద్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

- అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్
- ఉత్సవాల పేరిట బీఆర్ఎస్ రాజకీయ ప్రచారం
- డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి: తెలంగాణ ఇస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని తెలిసి కూడా రాష్ట్ర అభ్యున్నతి కోసం.. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది దగా నిరసనలో సీఎం కేసీఆర్ దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్ అబద్ధపు హామీలు ఇస్తూ.. ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏం ఘనతలు సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్నారని ప్రశ్నించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. ఉత్సవాల పేరిట.. ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన వెంటనే.. ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, సురేందర్, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కేసీఆర్

అనంతగిరి: కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలన అంతా దగానే అని, హామీలు నెరవేర్చని ఈ ఉత్సవాలు ఎందుకని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం పది తలల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్.. ప్రజాధనాన్ని పార్టీ ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తుందని ఆరోపించారు. వేడుకల నిర్వహణలో ప్రోటోకాల్ పాటించలేదని, తాజా, మాజీ ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం దక్కలేదని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రేషన్ కార్డుల జారీని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పకుండా తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏస్సీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, జిల్లా సీనియర్ నాయకులు కమల్ రెడ్డి, రత్నారెడ్డి, అయూబ్ అన్సారి, భాస్కర్ రెడ్డి, రవీందర్ మురళి, వేణుగోపాల్ రెడ్డి, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల పైసల్ రాలే

- నెల దాటినా ఖాతాల్లో చేరని నగదు
- వానాకాలం పంటల సాగుకు ఆర్థిక ఇబ్బందులు
- ఆందోళనలో అన్నదాతలు



కుల్కచర్ల ధాన్యం సేకరణ కేంద్రం

కుల్కచర్ల: ధాన్యం విక్రయించి నెల రోజులు దాటినా డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వానాకాలం పంటల పెట్టుబడికి నగదు లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వడ్లు అమ్మిన 24గంటల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెబుతున్న అధికారులు, పాలకుల మాటల్లో ఏమాత్రం నిజం లేదని మండిపడుతున్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో 17 కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం సేకరించారు. మహిళా సమాఖ్యలు, పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టారు.

రూ.8 కోట్లు పెండింగ్

కేవలం కుల్కచర్ల మండల రైతులకు సంబంధించి రూ.8 కోట్ల ధాన్యం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్ల తీరు రైతులకు ఇబ్బందికరంగా మారింది. తూకాలు పూర్తయిన ధాన్యం బస్తాలను స్టోరేజీ నిమిత్తం గోడౌన్లకు తరలించారు. వీటికి సివిల్ సప్లయ్ అధికారులు బిల్లులు నమోదు చేయాల్సి ఉంది. ఆతర్వాతే రైతులకు డబ్బులు అందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మరో 15 రోజులు పట్టే అవకాశం ఉంది.

“ త్వరగా వచ్చేలా చూడాలి



ధాన్యం వేసి నెలరోజులు అవుతోంది. ఇప్పటికీ డబ్బులు రాలేదు. వర్షాలు పడుతుండటంతో పంటలు వేద్దామంటే చేతిలో పైసలు లేవు. దీంతో ఏ పని కదలడం లేదు. అధికారులు స్పందించి త్వరగా వచ్చేలా చూడాలి.

– కృష్ణయ్య, రైతు

ఆందోళన చెందొద్దు



రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లిస్తుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

– హరికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుల్కచర్ల

ప్రియుడితో కలిసి భర్త హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- అత్వెల్లిలో వెలుగు చూసిన దారుణం
- పోలీసుల విచారణలో వాస్తవాలు బహిర్గతం



రాములు (ఫైల్)

అనంతగిరి: వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చింది. ఈ సంఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో వెలుగు చూసింది. సీఐ శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ మండల పరిధిలోని అత్వెల్లికి చెందిన నక్క రాములు(38) భార్య స్వప్న ఇదే గ్రామానికి చెందిన ఎం.పవన్‌కళ్యాణ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన రాములు పలుమార్లు ఆమెను మందలించాడు. దీంతో అతని అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి కుట్ర పన్నింది. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న రాములు గొంతు నులిమి చంపేశారు. ఉదయాన్నే ఏమీ తెలియనట్లు స్వప్న రోదిస్తూ కూర్చుంది. మృతుడి మెడపై గాయాలను గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న ఇరు కుటుంబాల వారు గొడవ పెట్టుకుని.. పోస్టుమార్టం చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చి, పోస్టుమార్టం పూర్తి చేయించారు. వికారాబాద్‌లో ఉండే మృతుడి చెల్లి ఎస్.యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరి విచారణలో అసలు వివరాలు బహిర్గతమయ్యాయి.

క్లుప్తంగా

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


రీజా


రామ్‌చరణ్

ధారూరు: నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. నవోదయ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలను గురువారం విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్‌లో చదువుతున్న కుక్కింద గ్రామానికి చెందిన విద్యార్థిని రీజా, పీసీఎం తండా విద్యార్థి రామ్‌చరణ్ ఎంపిక అయ్యారని స్కూల్ కరస్పాండెంట్ మధు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

యాలాల: తాండూరు రూరల్ సీఐ రాంబాబు గురువారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా పీఎస్‌లో నమోదు అయిన కేసుల వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్ఐ అరవింద్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పికెటింగ్, వాహనాల తనిఖీ, డ్రంకన్‌డ్రైవ్ కేసులు, చలాన్ల వివరాలపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతమైన యాలాల మండలంలో ఎక్కువగా ఆత్మహత్యల నివారణ, మద్యం తాగి వాహనాల నడపడం వల్ల జరిగే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బెంబేలెత్తిస్తున్న కేబుల్ దొంగలు


స్టాటర్ డబ్బాను ధ్వంసం చేసిన దుండగులు

దోమ: గ్రామాల్లో కేబుల్ దొంగలు బెంబేలెత్తిస్తున్నారు. వ్యవసాయ బోరు మోటార్లను టార్గెట్ చేసుకుని నిత్యం దొంగతనాలకు పాల్పడుతున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం దోమ మండల కేంద్రానికి చెందిన చుక్కన్నగారి బిచ్చిరెడ్డి పొలంలో బోరు మోటారు కేబుల్‌ను గుర్తు దొంగలు అపహరించారు. స్టాటర్ డబ్బాను ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పలువురి పొలాల్లో బోరు మోటార్ల కేబుల్‌ను గుర్తు తెలియని దొంగలు తస్కరించారన్నారు. అయితే బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. పోలీసులు వెంటనే స్పందించి దొంగల బారినుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.


బొంరాస్‌పేట ప్రధాన కూడలిలోని కిక్కిరిసిన ద్విచక్రవాహనాలు

బైక్‌లు సరే.. జాగ్రత్తలు మరి..

బొంరాస్‌పేట మండలంలో ఇంతకింతకు ద్విచక్ర వాహనాల వినియోగం పెరుగుతోందనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఉదయం నుంచి రాత్రివరకు బైక్‌ల సంచారానికి విరామం లేకుంటుంది. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఇలా కిక్కిరిసి ఉన్నాయి. నిత్యం ఇలా పెరిగిపోతున్న వాహనాలతో ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ జాగ్రత్తలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

- బొంరాస్‌పేట

సేంద్రియంపై ప్రచారమేదీ?

- రైతుల్లో కొరవడిన అవగాహన
- రసాయనాల వినియోగమే అధికం
- ఆర్థిక భారంతోపాటు నష్టాలే అధికం

నవాబుపేట: సేంద్రియ ఎరువులపై ప్రచారం కొరవడటంతో వినియోగంపై రైతులు అంతగా దృష్టి సారించడం లేదు. గ్రామాల్లో ఇంకా రసాయన ఎరువులనే వాడుతున్నారు. ఎటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ సమస్య నుంచి రైతులు బయట పడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగమే మార్గం. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పర్యావరణంపై ప్రభావం

రసాయన ఎరువుల వాడకంతో రైతులకు ఆర్థిక భారమే కాకుండా భూసారం కూడా తగ్గుతుంది. సరైన దిగుబడులు రావు. పర్యావరణంపై రసాయనిక ఎరువుల ప్రభావం చూపుతుంది. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. అదే స్థాయిలో సేంద్రియ ఎరువులు వేస్తే చీడపీడల బెడద తప్పడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు. వ్యవసాయంలో సరైన సలహాలు, చూచనలు ఇస్తున్నామని, అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్నంగా ఉంది. పంటకు సోకిన తెగుళ్లకు ఏ దశలో ఏ మందులు వాడాలో తెలియక ఎరువుల వ్యాపారులు ఇచ్చే చవకబారు, నాణ్యతలేని నకిలీ మందులు వాడుతూ నష్టపోతున్నారు. సేంద్రియ ఎరువులు ఆరుతడి పంటలకు కూరగాయల సాగుకు ఎంతో ఉపయోగపడుతాయి.


భూసారం పెంచేందుకు పొలంలో నిలిపిన గొర్రెల మంద (ఫైల్)

సేంద్రియంతో సిరులే..

సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి సైతం మంచివని డాక్టర్లు సూచిస్తున్నారు. సేంద్రియ తయారీ విధానం ప్రకృతి సిద్ధంగా ఆకులు, అలములు, చెత్తాచెదారంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు. ముందుగా తమకు అవసరమున్న కుండీలను ఏర్పాటు చేసుకొని ముడి సరుకు సేకరించి కొంత వరకు నీటిలో వేసి దాదాపు 45 రోజులు నిల్వ ఉంచితే ఎరువు తయారు అవుతుంది. తరువాత దానిని పంటలకు ఉపయోగించవచ్చు. సేంద్రియ ఎరువుల వాడకంతో పెరగనున్న భూసారం, వర్మి కంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చు. చెరువు ఒండ్రుమట్టిని తరలించడం, జీలుగ పంటను సాగు చేసుకొని పొలంలో కలియదున్నడం లాంటి పద్ధతులు పాటించాలి. పశువుల పేడ, పొల్లాల్లో గొర్రెల మంద నిలపడం వల్ల దిగుబడులు అధికంగా వస్తాయి. సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ధాన్యాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం



సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. రైతులకు అందుబాటులో ఉండే పశువుల, గొర్రెల ఎరువును పొలాల్లో వేసుకోవాలి. జీవన ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వర్మీ కంపోస్టు బెడ్లు, వానపాములు రావాల్సి ఉంది. కానీ ఇప్పుడు రావడం లేదు.

- ప్రసన్నలక్ష్మి, వ్యవసాయాధికారి, నవాబుపేట

స్వీపర్లతో చికిత్స అందించారు


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరామయ్య

- అందువల్లే మా అమ్మ మృతి చెందింది
- నగలు సైతం తస్కరించారు
- ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబసభ్యుల ఆందోళన
- మహిళకు చికిత్స అందించిన స్వీపర్ల వీడియో వైరల్

పరిగి: 'రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను ఆస్పత్రికి తీసుకువస్తే స్వీపర్లు, సిబ్బందితో చికిత్స అందించారు.. మహిళ మృతికి కారకులయ్యారు. అంతేకాకుండా ఒంటిపై ఉన్న ఆభరణాలు సైతం తస్కరించా'రంటూ బాధిత కుటుంబీకులు గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మా అమ్మ చావుకు ఆస్పత్రి సిబ్బందే కారణమంటూ మండిపడ్డారు. ఈ మేరకు వీడియోను సైతం వారు వైరల్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న మండల పరిధిలోని తుంకులగడ్డ సమీపంలోని బీజాపూర్ జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొట్టిన విషయం విదితమే. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 17మందికి గాయాలయ్యాయి. అయితే రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే తీవ్రంగా గాయపడిన బ్రాహ్మణ్‌పల్లి తండాకు చెందిన హేమ్లీబాయిని పరిగి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రిలో ఉన్న స్వీపర్లు, సిబ్బందితో వైద్యం చేయించారు. నొప్పి వస్తుందని బాధితురాలు చెబుతున్నా వినకుండా ఇష్టారాజ్యంగా ఆమెను కొట్టుకుంటూ చికిత్స అందించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా బాధిత కుటుంబ సభ్యులు వీడియో తీశారు. తీరా మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించాలని సూచించారన్నారు. తరలిస్తుంటే మార్గమధ్యంలోనే మృతి చెందిందని కుటుంబసభ్యులు వాపోయారు. ఆమె ఒంటిపై ఉన్న 16 తులాల వెండి, బంగారు ఆభరణాలు సైతం మాయమయ్యాయని వారు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను నిలదీశారు. వైద్యుల నిర్లక్ష్యంపై మృతురాలి కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకరామయ్య ఆస్పత్రి వద్దకు వచ్చి బాధితులకు నచ్చచెప్పారు. రోగి దగ్గర నగలు దొంగలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్‌లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయ సమీపంలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, వీరభద్రుడు, నాగులు, నందీశ్వరుడు, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామస్తులు గురువారం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ధాన్యాదివాసం నిర్వహించారు. హోమంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌గౌడ్, పెద్ద నర్సింహులుగౌడ్, నర్సిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వడ్డె చెన్నప్ప, బీరప్ప, కిషోర్‌గౌడ్, రంజిత్, రాజు ఉన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- కేసీఆర్‌ను పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కు పంపిస్తాం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ
- తాండూరులో ముఖ్య కార్యకర్తల సమావేశం


ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న

తాండూరు: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కు పంపిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలో పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత ఖ్యాతిని పెంచిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. మన యోగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నందకుమార్, మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీ కృష్ణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు ఉన్నారు.

హైవే పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు

భూత్పూర్-మన్నెకెళ్లి జాతీయ రహదారిలో భాగంగా తాండూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో అక్రమాలు జరిగాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరిపిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

ఏకవాక్య తీర్మానం ఆమోదం


మౌనం పాటిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

వికారాబాద్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి డీపీఆర్సీ భవనంలో జిల్లా పరిషత్ సమావేశం ఏర్పాటు చేసి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. మౌనం పాటించి అమర వీరులకు నివాళులర్పించారు. త్యాగాలను స్మరిస్తూ ఏకవాక్య తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ సుభాషిణి, ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పూడూరు: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టాటా ఏస్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా మండల పరిధిలోని కండ్లపల్లి వద్ద పట్టుకున్నారు. లావుడ్యాశ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వాహనాన్ని డీసీఎంఎస్ అధికారులకు అప్పగించామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్చకుల వేతన జీవోను విడుదల చేయాలి

డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ


మాట్లాడుతున్న డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

కొడంగల్ రూరల్: దేవాలయాల పటిష్టతకు చర్యలు చేపడుతూ, ఆధ్యాత్మికతను పెంపొందించడం అభినందనీయమని, ఇందుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అని ధూప దీప నైవేద్య అర్చక సంఘం (డీడీఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అర్చకులకు రూ.10వేల వేతనం అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో జీవో విడుదల చేస్తూ అమలు చేసేందుకు కృషిచేయాలన్నారు. దేవాలయాల్లో అర్చకులు నిత్య పూజా కైంకర్యాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. ఆలయాల ప్రాంగణాలలో శుభ్రత పాటిస్తూ భక్తులకు ప్రశాంతత చేకూరేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

90మంది అర్చకుల నియామకం

జిల్లాలో 160మంది దేవాలయాల అర్చకులు ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, వీటిలో 90మంది అర్చకులకు పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి అన్నారు. మిగిలిన 70మంది దేవాలయాల అర్చకులకు స్థానిక ప్రజా ప్రతినిధులు కృషిచేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా


మొండిగౌరెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, సరైన ప్రచారం నిర్వహించుకుని బీజేపీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా యాచారం, మొండిగౌరెల్లి, నక్కర్తమేడిపల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. యాచారంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని నర్సరీలు, మొక్కల పెంపకం, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, ఉపాధి పనులు వంటి అనేక పథకాలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు పైసా నిధులు మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు వెంకటేష్, శివకుమార్, మొండిగౌరెల్లి పంచాయతీ వార్డు సభ్యులు అంజమ్మ, పాండు యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యుఘోష

విద్యుదాఘాతంతో మూడు పశువుల మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కౌలు రైతు గుంటి పాపయ్య వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం పశువులను మేపడానికి వెళ్లాడు. తనకు ఉన్న రెండు కాడెద్దులు, పాడి ఆవు మేత మేస్తుండగా అచ్యుత్‌రెడ్డి పొలంలో కరెంట్ తీగలు కట్ అయి పశువులకు తగిలాయి. దీంతో మూడు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. కాగా, పశువుల మృతికి కారకులైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు సామేలు, ముసలయ్య, జంగయ్య డిమాండ్ చేశారు. బాధితుడికి పరిహారం అందించాలని కోరారు.

సమగ్ర విచారణ చేపట్టండి

ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో జరిగిన విద్యుత్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ రంగారెడ్డి జిల్లా సీజీఎం ఆనంద్ ఆదేశించారు.

మహేందర్‌రెడ్డి అవసరం లేదు

- రోహిత్‌రెడ్డికి నేను పెట్టిన భిక్షే
- నా వల్లే ఎమ్మెల్యే టికెట్
- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్


తాండూరు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

తాండూరు: నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం బలంగానే ఉందని, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి అవసరం లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు, తాండూరు ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో 'దగా దశాబ్దికి రావణ వధ' అనే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో తెలంగాణకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత కల్వకుంట్ల కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. నేను పెట్టిన భిక్షతోనే రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని, నేను చెబితేనే రోహిత్‌రెడ్డికి అధిష్టానం టిక్కెట్ ఇచ్చిందని.. దాంతో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారని అన్నారు. తాండూరు అభివృద్ధిని రోహిత్‌రెడ్డి విస్మరించారని ఆరోపించారు. తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం బలంగానే ఉందని, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి అవసరం లేదని అన్నారు. జిల్లాల పునర్విభజనలో వికారాబాద్ జిల్లాకు అన్యాయం చేసిన వ్యక్తి మహేందర్‌రెడ్డి అని ఆరోపించారు. గ్రామీణప్రాంత మండలాలతో వికారాబాద్ జిల్లా ఏర్పాటు చేసి అన్యాయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం కాంగ్రెస్సేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణ మాఫీ, రూ.5 లక్షలతో గృహ నిర్మాణం, మహిళలకు రూ.500 సిలిండర్‌తో పాటు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, ఆయా మండలాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.